క్లుప్తంగా

పశువుల దాహార్తి తీర్చడానికి నీటి తొట్టెల నిర్మాణం



మలకపల్లిలో నీటి తొట్టెల నిర్మాణంలో పాల్గొన్న సర్పంచ్, అధికారులు

తాళ్లపూడి: వేసవిలో పశువుల దాహార్తి తీర్చడానికి నీటి ఎద్దడి నివారణకు ప్రభుత్వ ఆదేశాల మేరకు నీటి తొట్టెల నిర్మాణం చేపట్టినట్టు ఎన్ఆర్ఈజీఎస్ ఏపీవో సీహెచ్ రమాదేవి తెలిపారు. పశువులు ఎక్కువగా తిరిగే ప్రదేశాల్లో వీటిని నిర్మిస్తామన్నారు. మలకపల్లి, అన్నదేవరపేటలోని పశు వైద్యశాలల సమీపంలో నీటి తొట్టెలను నిర్మిస్తామని తెలిపారు. రూ.38 వేలు నిర్మాణ వ్యయంగా నిర్ణయించారని, మండలానికి అయిదు నీటి తొట్టెలు మంజూరైనట్టు చెప్పారు. నీటి తొట్టెలు అవసరం ఉన్నవారు ఏన్ఆర్ఈజీఎస్ సిబ్బందికి సమాచారం ఇవ్వాలన్నారు. మలకపల్లిలో నీటి తొట్టె నిర్మాణ కార్యక్రమంలో సర్పంచ్ రాపాక రాజేశ్వరి, కార్యదర్శి కామేశ్వరి ఉపాధిహామీ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు గుండె వైద్యశిబిరం

ఉండ్రాజవరం: ఉండ్రాజవరం వృద్ధాశ్రమం వద్ద బుధవారం ఉచిత గుండె వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు మంగళవారం నిర్వాహకులు తెలిపారు. ఈవైద్య శిబిరంలో గుండె దడ, గుండె నొప్పి, ఆయాసం, ఛాతిలో నొప్పి, మంట, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, ఎక్కువగా చెమట పట్టడం తదితర లక్షణాలతో ఇబ్బందులు పడుతున్న వారికి వైద్య పరీక్షలు చేస్తారన్నారు. విజయవాడ గుండె వైద్య నిపుణుడు డాక్టర్ వైవీ రావు హస్పిటల్ వైద్యులు బీపీ పరీక్షలతో పాటు ఈసీజీ, టూడీ ఎకో పరీక్షలు ఉచితంగా చేస్తారన్నారు. గ్రామ ప్రజలు ఈవైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

దాతల సహకారం అభినందనీయం

కొవ్వూరు: ఆసుపత్రిలో వైద్య సేవలందించేందుకు అవసరమైన సామగ్రి అందించడానికి దాతలు ముందుకు రావడం అభినందనీయమని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని రెండు అర్బన్ హెల్త్ సెంటర్లకు దాతల సహకారం సమకూర్చిన రూ.4లక్షల సామగ్రిని ఎమ్మెల్యే చేతుల మీదుగా ఆయా హెల్త్ సెంటర్లకు అందజేశారు. క్రిస్టియన్‌పేట, శ్రీనివాసపురంలోని హెల్త్ సెంటర్లకు ఫర్నిచర్, ఏసీ, కూలర్ అందజేశారు. మునిసిపల్ చైర్ పర్సన్ బావన రత్న కుమారి, కమిషనర్ టి.నాగేంద్రకుమార్, మాజీ మునిసిపల్ చైర్మన్ సూరపనేని చిన్ని. బీవీ ముత్యాలరావు, తహసీల్దార్ ఎం.దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

నిడదవోలు : పట్టణంలో ఒకటో వార్డులో ఎగ్జిబిషన్ గ్రౌండ్ వీధిలో మున్సిపల్ సాధారణ నిధులు రూ. 8.40 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు మంగళవారం మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ శంకుస్థాపన చేశారు. కౌన్సిలర్ గోపిరెడ్డి శ్రీనివాస్, మున్సిపల్ ఏఈఈ సామవేదం హేమంత్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రూ.4.98 కోట్ల పన్నుల వసూలు

నిడదవోలు : పురపాలక సంఘంలో 2024-25 ఆర్థిక సంవత్సరానికి రూ.4.98 కోట్ల పన్నుల వసూలైనట్టు మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇంటి పన్ను, ఖాళీ స్థలాల పన్నుల డిమాండ్ రూ.8.42 కోట్లు ఉండగా రూ.4.98 కోట్ల పన్నులు వసూలయ్యాయి. మంచినీటి పన్నులు రూ.1.70 కోట్లు డిమాండ్ ఉండగా ఇప్పటి వరకు రూ.95 లక్షలు వసూలయ్యాయి. 2023-24 ఆర్థిక సంవత్సరం కంటే అన్ని కలిపి రూ.1.31 కోట్లు అదనంగా వసూలయ్యాయని ఆయన పేర్కొన్నారు. పట్టణంలో 13వ వార్డు సచివాలయంలో అత్యధికంగా 95 శాతం పన్నులు వసూలు చేసి మొదటిస్థానంలో నిలిచిందన్నారు. ఈనెల 6వ తేదీ నుంచి 2025-26 ఆర్థిక సంవత్సరానికి పన్ను వసూళ్లు ప్రారంభమవుతాయని, ప్రజలు సకాలంలో పన్నులు చెల్లించి పట్టణాభివృద్ధికి సహకరించాలని చైర్మన్ ఆదినారాయణ కోరారు.

ప్రభుత్వాసుపత్రుల్లో చలివేంద్రాల ఏర్పాటు



నల్లజర్ల పీహెచ్‌సీలో చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వెంకట్రాజు

నల్లజర్ల: వేసవి నేపథ్యంలో నియోజకవర్గంలోని అన్ని ప్రభుత్వ ఆసుపత్రులలో చలివేంద్రాలు, రోగులకు కూలర్ సౌకర్యం ఏర్పాటు చేస్తున్నట్టు ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు తెలిపారు. నల్లజర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కూలర్, కూలింగ్ మంచినీటి చలివేంద్రాన్ని మంగళవారం ఆయన ప్రారంభించారు.ఈ సందర్భంగా పార్టీ మండల అధ్యక్షుడు తాతిన సత్యనారాయణ మాట్లాడుతూ ఎమ్మెల్యే తనకు వచ్చే జీతభత్యాలతో ఈ కార్యక్రమం చేపట్టినట్టు చెప్పారు. కార్యక్రమంలో షేక్ మీరా సాహెబ్, యలమాటి శ్రీనివాసరావు, గుదే వెంకట సుబ్బారావు, డాక్టర్లు గంగాధరరావు, సిరాజుద్దీన్ పాల్గొన్నారు.

మొక్కజొన్న.. ఎంచక్కా..

- మెట్ట ప్రాంతంలో ముమ్మరంగా కోతలు
- ఆరుతడి పంటగా సాగు
- ఎకరాకు 45 క్వింటాళ్ల దిగుబడి
- రూ.1.10 లక్షల ఆదాయం



దేవరపల్లి మండలం పల్లంట్ల నుంచి హైదరాబాద్‌కు ఎగుమతి చేస్తున్న మొక్కజొన్న



దేవరపల్లి మండలం పల్లంట్లలో సాగులో ఉన్న మొక్కజొన్న చేను

దేవరపల్లి: మెట్ట ప్రాంతంలో మొక్కజొన్న పంట కోతలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. నెల రోజులుగా రైతులు కోతలు కోసి రోడ్ల పైన, పొలాల్లోని కళ్లాల్లో ఎండబెట్టి యంత్రాల ద్వారా గింజలు ఒలిచి, ఎప్పటికప్పుడే వ్యాపారులు, విత్తన తయారీ కంపెనీలకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. కొనుగోలు చేసిన గింజలను వ్యాపారులు ఇతర ప్రాంతాలకు ఎగుమతి చేస్తున్నారు. దేవరపల్లి మండలం పల్లంట్ల కేంద్రంగా చుట్టుపక్కల గ్రామాల నుంచి తీసుకు వచ్చిన పంటను ఎగుమతి చేస్తున్నారు. ఎక్కువగా కావేరీ కంపెనీ వంగడాన్ని ఇక్కడి రైతులు పండించారు. దీంతో ఆ కంపెనీ ప్రతినిధులు వచ్చి ఇక్కడి నుంచి పంటను కొనుగోలు చేసి, హైదరాబాద్‌లోని విత్తన తయారీ కేంద్రానికి తరలిస్తున్నారు. రైతులు పండిస్తున్న పంటలో 90 శాతం విత్తనోత్పత్తి కంపెనీలు కొనుగోలు చేస్తూండగా, 10 శాతం పంటను వాణిజ్య అవసరాలకు రైతులు విక్రయిస్తున్నారు. తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఆదాయం వచ్చే పంట మొక్కజొన్న. విత్తనం వేసిన 120 రోజుల్లో కోతకు వస్తోంది. మెట్ట ప్రాంతంలో నీటి సదుపాయం లేని భూముల్లో ఆరుతడి పంటగా రబీలో దీనిని సాగు చేస్తున్నారు. కావేరీ రకం వంగడం ఎకరాకు 30 నుంచి 35 క్వింటాళ్ల దిగుబడి ఇస్తూండగా, వాణిజ్య అవసరాలకు పండిస్తున్న పంట 40 నుంచి 45 క్వింటాళ్ల వరకూ వస్తోందని రైతులు తెలిపారు.

క్వింటాల్‌కు రూ.2,250

క్వింటాల్ మొక్కజొన్న గింజలను విత్తనోత్పత్తి కంపెనీలు రూ.3,500 నుంచి రూ.4,500 వరకూ కొనుగోలు చేస్తూండగా.. వాణిజ్య అవసరాలకు పండిస్తున్న గింజల ధర రూ.2,250 పలుకుతోందని రైతులు చెబుతున్నారు. ఎకరాకు సుమారు రూ.1.10 లక్షల నుంచి రూ.1.20 లక్షల వరకూ ఆదాయం వస్తోందని అంటున్నారు. ఉభయ గోదావరి జిల్లాల్లో పౌల్ట్రీలు విస్తరించడంతో మొక్కజొన్న గింజలను కోళ్లకు మేతగా వాడుతున్నారు. గత రెండేళ్లతో పోల్చుకుంటే ఈ ఏడాది పంట సాగు విస్తీర్ణం గణనీయంగా తగ్గిందని రైతులు చెప్పారు. లాభసాటిగా ఉండడంతో మొక్కజొన్నకు బదులు రైతులు పొగాకు ఎక్కువగా సాగు చేస్తున్నారు. దేవరపల్లి మండలం పల్లంట్ల, కురుకూరు గ్రామాల్లో గతంలో సుమారు 900 ఎకరాల్లో మొక్కజొన్న పంట సాగు జరిగేది. ఈ ఏడాది 100 ఎకరాలకు తగ్గిందని రైతులు తెలిపారు. దీంతో మొక్కజొన్నకు డిమాండ్ ఏర్పడిందని చెబుతున్నారు.

7,300 ఎకరాల్లో సాగు

కొవ్వూరు డివిజన్‌లోని దేవరపల్లి, కొవ్వూరు, గోపాలపురం, చాగల్లు, తాళ్లపూడి, మండలాల్లోని సుమారు 7,300 ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేసినట్టు అధికారులు తెలిపారు. అయితే, గత ఏడాది కంటే ఈ ఏడాది రబీలో పొగాకు సాగు లేని మెట్ట గ్రామాల్లో మొక్కజొన్న సాగు స్వల్పంగా పెరిగిందని వారు చెబుతున్నారు. గోపాలపురం, నల్లజర్ల మండలాల్లో ఎక్కువ విస్తీర్ణంలో మొక్కజొన్న పండిస్తున్నారు.

దిగుబడి బాగుంది



రబీలో ఆరుతడి పంటగా మొక్కజొన్న సాగు చేస్తున్నాం. దిగుబడి బాగుంది. ఎకరాకు 40 నుంచి 45 క్వింటాళ్లు వస్తోంది. టన్ను గింజల ధర రూ.22,500 పలుకుతోంది. ముమ్మరంగా కోతలు జరుగుతున్నాయి. ఎక్కువగా విత్తనాల కోసం కంపెనీలు కొనుగోలు చేస్తున్నాయి. నాలుగెకరాల్లో పంట వేశాను. సుమారు 160 క్వింటాళ్ల దిగుబడి వస్తుందని అంచనా వేస్తున్నా.

– వలిరెడ్డి భాస్కరరావు, రైతు, అనంతపల్లి, నల్లజర్ల మండలం

గిట్టుబాటు కావడం లేదు



పెట్టుబడి ఎక్కువ కావడంతో మొక్కజొన్న ధర గిట్టుబాటు కావడం లేదు. ఈ రబీలో ఏడెకరాల్లో మొక్కజొన్న వేశాను. దిగుబడి బాగుంది. ఎకరాకు 40 నుంచి 45 క్వింటాళ్ల దిగుబడి వస్తోంది. ధర క్వింటాల్‌కు రూ.2,225 ఉంది. కనీసం రూ.3 వేలు ఉంటే కౌలుదారులకు గిట్టుబాటు అవుతుంది. పెట్టుబడులు విపరీతంగా పెరిగాయి.

– గుదే శ్రీనివాస్, రైతు, కరగపాడు, గోపాలపురం మండలం

విత్తనోత్పత్తికి వినియోగం



పండించిన పంటలో ఎక్కువ శాతం విత్తనోత్పత్తికి వినియోగిస్తున్నారు. వివిధ విత్తన కంపెనీలు రైతులను ప్రోత్సహించి రబీలో మెట్ట ప్రాంతంలో ఆరుతడి పంటగా మొక్కజొన్న పండిస్తున్నారు. పండిన పంటను ఆయా కంపెనీలు కొనుగోలు చేస్తున్నాయి. ఈ ఏడాది మొక్కజొన్న దిగుబడి బాగుంది,. లాభసాటిగా ఉండడంతో ఎక్కువ మంది సాగు చేస్తున్నారు. నల్లజర్ల మండలంలో 2,100 ఎకరాల్లో పంట వేశారు. దిగుబడి ఎకరాకు 45 క్వింటాళ్లు వస్తోంది. క్వింటాల్ ధర రూ.2,200 పలుకుతోంది.

– కె.కమల్‌రాజ్, మండల వ్యవసాయాధికారి, నల్లజర్ల

ఎస్టీయూ జిల్లా మహిళా కన్వీనర్ సునీతకు సత్కారం



రాజమహేంద్రవరం ఆనం రోటరీ హాలులో అన్నదేవరపేటకు చెందిన జిల్లా మహిళా కన్వీనర్ జేడీ సునీతకు సత్కారం

తాళ్లపూడి: ఎస్టీయూ ఆధ్వర్యంలో మహిళా వికాసం కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు జిల్లా ఎస్టీయూ అధ్యక్షుడు జేడీవజే డేనియల్ బాబు తెలిపారు. సోమవారం రాజమహేంద్రవరం ఆనం రోటరీ హాలులో వనితా వికాసం- 2025 కార్యక్రమంలో పలువురు మహిళా ఉపాధ్యాయులను సత్కరించినట్టు తెలిపారు. ఈ సందర్భంగా మండలంలోని అన్నదేవరపేటకు చెందిన ఉపాధ్యాయరాలు, జిల్లా మహిళా కన్వీనర్ జేడీ సునీతను ఘనంగా సత్కరించారు. ఈ సమావేశంలో జిల్లా నలు మూలల నుంచి వచ్చిన మహిళా టీచర్లు చక్కని పాటలు, కవితలు, నాట్యాలు, సంగీతం రూపకాలు ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఎల్.సాయి శ్రీనివాస్ పాల్గొన్నారు.

5న సమిశ్రగూడెంలో జగ్జీవన్‌రామ్ విగ్రహావిష్కరణ

నిడదవోలు రూరల్: సమిశ్రగూడెం అరుంధతీపేటలో ఈనెల 5వ తేదీ శనివారం 10 గంటలకు భారత మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్ 9 అడుగుల నూతన విగ్రహాన్ని ఆవిష్కరిస్తామని బాబూ యువజన సేవా సంఘం అధ్యక్షుడు ముప్పిడి రాజారత్నం మంగళవారం తెలిపారు. ముఖ్య అతిథిగా జగ్జీవన్‌రామ్ మనవడు, లోక్‌సభ మాజీ స్పీకర్ మీరాకుమారి కుమారుడు డాక్టర్ అన్షుల్ అవిజిత్, ఉస్మానియా యూనివర్సిటీ ప్రిన్సిపాల్, ప్రొఫెసర్ సి. కాశీం హాజరవుతారని ఆయన చెప్పారు.

నేడు స్వయం ఉపాధి రుణాల కోసం ఇంటర్వ్యూలు



తాళ్లపూడి మండల పరిషత్ కార్యాలయంలో సమావేశమైన అధికారులు

తాళ్లపూడి: మండలంలోని స్వయం ఉపాధి రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న వారికి బుధవారం ఉదయం నుంచి ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని ఎంఈపీడీవో టీబీ వెంకటరమణ తెలిపారు. తాళ్లపూడి మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ జొన్నకూటి పోశిరాజుతో కలసి ఆయన మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ మండలంలోని మొత్తం 651 మంది దరఖాస్తు చేశారని తెలిపారు. ఇందులో బీసీ కార్పొరేషన్ 34 యూనిట్లు, 1 జనరిక్ మందుల షాపు, కాపు కార్పొరేషన్ యూనిట్లు 28 , ఒక మిల్క్‌డైరీ ఉన్నాయని తెలిపారు. ఆర్య వైశ్య కార్పొరేషన్ 1, బ్రాహ్మణ 1, కమ్మ 1 చొప్పున యూనిట్లు ఉన్నాయని తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి బ్యాంక్ అధికారులు సమక్షంలో లబ్ధిదారుల ఎంపికకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారన్నారు.

ఉపాధికి తోడుగా..జోడెద్దులతో సాగు

- సంప్రదాయ పద్ధతిలో అప్పన్న వ్యవసాయం
- యంత్రాల వినియోగం లేకపోవడంతో వ్యవసాయంలో ఖర్చులు ఆదా



జోడెద్దులతో పొలం దున్నుతున్న అప్పన్న

నల్లజర్ల: పల్లి అప్పన్నకు పుట్టుకతోనే మూగ, చెవుడు. అయినా మొక్కవోని దీక్షతో జీవితాన్ని సాగిస్తున్నాడు. గతంలో వ్యవసాయ కూలీగా ఉన్న అతను ఇపుడు జోడెద్దులతో వ్యవసాయ పనులు చేస్తూ ఉపాధి పొందుతున్నాడు. సాగులో వస్తున్న మార్పులకు అనుగుణంగా దుక్కి మొదలు పంట చేతికొచ్చే వరకు రైతులంతా ఆధునిక యంత్ర సామగ్రినే వినియోగిస్తున్నా మండలంలోని అనంతపల్లికి చెందిన అప్పన్న మాత్రం విత్తనం నాటడం దగ్గర నుంచి పంట ఇంటికి తీసుకువచ్చే వరకు కాడెద్దులతో వ్యవసాయం చేస్తూ పశు సంపదను కాపాడే ప్రయత్నం చేస్తున్నాడు.దీంతో పాటు ఇతరుల పనులకు వెళ్తూ స్వయం ఉపాధి పొందుతూ కుటుంబాన్ని పోషించుకుంటూ ఆదర్శంగా నిలిచాడు. ఆధునిక యంత్రాల కొనుగోలు సామర్థ్యం లేని చిన్న, సన్నకారు రైతులకు జోడెద్దులపైనే ఆధారపడి పంటలు సాగు చేస్తూ పెట్టుబడుల భారాన్ని తగ్గించుకుంటున్నారు. కూరగాయల సాగు, పత్తి, మొక్కజొన్న, పెసర, మినుము, కంది పంటల సాగులో సాళ్లు వేయడం, పైపాటు పనులు చేయడానికి జోడెద్దుల నాగలినే వినియోగిస్తుంటారు. పంట పూత, పిందె దశలో యంత్రాలు వినియోగిస్తే పంట నష్టపోవాల్సి వస్తుందని రైతులు చెబుతున్నారు. ట్రాక్టరు, పవర్ టిల్లర్ వంటి వాటికి ఏడాదిలో కొన్నాళ్లే పని ఉన్నా సంప్రదాయ పద్ధతిలో సాగు చేస్తున్న అప్పన్నకు మాత్రం ఏడాది పొడవునా గిరాకీ ఉంటోంది. డీజిల్ ధరలు పెరగడంతో ట్రాక్టరు, పవర్ టిల్లర్ల అద్దెలు పెరగడంతో రైతులకు భారంగా మారాయి. అదునులో దుక్కి దున్నడానికి నాగలి అనుకూలంగా ఉంటుందని ఈ ప్రాంత రైతులు చెబుతున్నారు.

అన్నదాత కష్టం.. దళారుల పరం



నల్లజర్లలో యంత్రాలతో వరి కోత

నల్లజర్ల: రైతులు ఆరుగాలం శ్రమించి పండించిన పంటను ప్రభుత్వం సకాలంలో కొనేందుకు ఏర్పాట్లు చేయకపోవడంతో తమ కష్టం రైస్‌మిల్లర్ల పాలవుతోందని రైతులు వాపోతున్నారు. మండలంలో 2065 హెక్టార్లలో వరి పంట సాగయింది. ఇందులో ఎంటీయూ-1121, యస్ఎల్-10, పీఆర్-126, పీఎస్ఆర్-15048, ఎంటీయూ-1153 రకాలు సాగు చేశారు. యస్.ఎల్-10 రకం అన్నిచోట్ల పక్వానికి వచ్చి గత ఐదు రోజులుగా ముమ్మరంగా కోతలు ప్రారంభించారు. కోసిన పంటను ఇంట్లో దాచుకునే పరిస్థితి లేదు. దీంతో బాయిల్డ్ రైస్ మిల్లలతో ఒప్పందం కుదుర్చుకొని తక్కువ ధరకు అంటే రూ.1450లకే విక్రయిస్తున్నారు. అదే ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనగోలు కేంద్రంలో అయితే రూ.1725లకు రైతుకు అందేది. ఎకరానికి 53 నుంచి 70 బస్తాల వరకు దిగుబడి వస్తున్నట్టు రైతులు చెబుతున్నారు. ఈ ధాన్యం ఏ మాత్రం ఆరబెట్టినా ముక్క అయ్యే పరిస్థితి. నిల్వ చేయడానికి ఏ మాత్రం పనిచేయదు. అందుకే కోసిన వెంటనే మిల్లుకు తరలిస్తున్నారు. ఒక్కో బస్తాకు రూ.300 నుంచి రూ.275 వరకు నష్టపోతున్నట్టు రైతులు చెబుతున్నారు. ఎకరానికి 14 వేల వరకు రైతు నష్టపోతున్నాడు. కొనుగోలు కేంద్రాలు మరో 10 రోజుల వరకు ప్రారంభించే అవకాశం లేదని అధికారులు చెబుతున్నారు. పెట్టుబడులకు తెచ్చిన అప్పులు తీర్చేందుకు తక్కువ ధరకైనా ధాన్యం అమ్ముకుంటున్నారు. మిల్లర్లు రైతుల అవసరాలను సొమ్ము చేసుకుంటున్నారు. రైతుల శ్రమదోపిడీ అవుతుందని, ప్రభుత్వం వెంటనే స్పందించి మద్దతు ధరకు ధాన్యం కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు.

వాటర్ ట్యాంకు అందజేత



నాయీబ్రాహ్మణ సంఘ భవనానికి వాటర్ ట్యాంకు అందజేస్తున్న దాత వెంకటేశ్వరరావు

దేవరపల్లి: యువ పారిశ్రామికవేత్త మాధవరపు వెంకటేశ్వరరావు స్థానిక నాయీ బ్రాహ్మణ సంఘం భవనానికి 750 లీటర్ల సామర్థ్యం గల వాటర్ ట్యాంకును ఉచితంగా అందజేశారు. ట్యాంకును మంగళవారం సంఘం సభ్యులకు వెంకటేశ్వరరావు అందజేశారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు జాజి మొగ్గల శ్రీనివాస్, గౌరవాధ్యక్షులు కడియం రంగారావు, కడియం శ్రీనివాస్, కడియం సత్తిబాబు, వర్తిపర్తి రాజు, సోనాయిల వెంకటేష్, పలువురు నాయీబ్రాహ్మణులు, జనసేన నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం



యాదవోలు వద్ద రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన బోడ పవన్‌కుమార్

దేవరపల్లి: వేగంగా వెళుతున్న పల్సర్ బైక్ అదుపుతప్పి గ్రీన్ ఫీల్డ్ హైవేపై గల రెయిలింగ్‌ను ఢీ కొని యువకుడు దుర్మరణం చెందిన ఘటన దేవరపల్లి మండలం యాదవోలు వద్ద మంగళవారం రాత్రి జరిగింది. పోలీసుల కథనం ప్రకారం కొయ్యలగూడెం మండలం అంకాలగూడెంకు చెందిన బోడ పవన్ కుమార్ (25) పల్సర్ బైక్‌పై వెళుతుండగా యాదవోలు గ్రామ సమీపంలో అదుపు తప్పి గ్రీన్ ఫీల్డ్ హైవేపై భద్రత నిమిత్తం ఏర్పాటు చేసిన ఇనుప రెయిలింగ్‌ను ఢీ కొట్టాడు. ఈ ప్రమాదంలో గాయపడిన పవన్‌కుమార్ బైక్ ఆపకుండా కొంత దూరం వెళ్లి అక్కడ ఆగి ఒక్కసారిగా కుప్పకూలి మృతి చెందినట్టు దేవరపల్లి ఎస్సై వి.సుబ్రహ్మణ్యం తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

విద్యుత్ చార్జీలు తగ్గించాలని ఇంటింటా ప్రచారం

ప్రకాశం నగర్: విద్యుత్ చార్జీలు తగ్గించాలని, ఇళ్లకు ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్లు బిగించ వద్దంటూ సీపీఎం ఆధ్వర్యంలో ఏప్రిల్ నెలలో ఇంటింటా ప్రచారం నిర్వహిస్తామని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి టి.అరుణ్ తెలిపారు. స్థానిక పార్టీ కార్యాలయంలో మంగళవారం ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ప్రజలపై సర్దుబాటు చార్జీల భారాన్ని, బాదుడే బాదుడును కొనసాగిస్తోందన్నారు. అదానితో చేసుకున్న స్మార్ట్ మీటర్ల ఒప్పందాన్ని అమలు చేస్తూ ప్రజలపై మరో పిడుగు వేస్తున్నారని ఆరోపించారు. ఈ ప్రీ పెయిడ్ స్మార్ట్ మీటర్‌కు రూ.12 వేల భారాన్ని కూడా ప్రజలపై మోపుతున్నారని తెలిపారు. స్మార్ట్ మీటర్లు పెట్టవద్దని, విద్యుత్ చార్జీలు తగ్గించాలంటూ ఇంటింటికీ తిరిగి స్టిక్కర్లను అతికిస్తామన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు జువ్వల రాంబాబు, బి.పవన్, జిల్లా కమిటీ సభ్యుడు ఎం.సుందర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

పశ్చిమ డెల్టాకు నీటి విడుదల పెంపు



నిడదవోలు వద్ద నిండుగా ప్రవహిస్తున్న పశ్చిమ డెల్టా ప్రధాన కాలువ

నిడదవోలు : విజ్జేశ్వరం హెడ్‌స్లూయిజ్ నుంచి పశ్చిమ డెల్టా ప్రధాన కాలువకు మంగళవారం సాగునీటి విడుదలను పెంచారు. గోదావరి పశ్చిమ డెల్టా పరిధిలో రైతుల సాగునీటి అవసరాల మేరకు జలవనరుల శాఖ ధవళేశ్వరం హెడ్ వర్క్స్ అధికారులు నీటి విడుదలను ఎప్పటికప్పుడు క్రమబద్ధీకరిస్తున్నారు. దీనిలో భాగంగా పశ్చిమ డెల్టాకు 5,500 క్యూసెక్కులు, తూర్పు డెల్టాకు 3,200, సెంట్రల్ డెల్టాకు 2,000 క్యూసెక్కులు వదులుతున్నారు. గోదావరి నదిలోకి సీలేరు జలాశయం నుంచి 10,622 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. పశ్చిమ డెల్టా పరిధిలో నరసాపురం కాలువకు అత్యధికంగా 2,026 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. ఏలూరు కాలువకు 1,024 క్యూసెక్కులు, తణుకు కాలువకు 1,220 క్యూసెక్కులు, అత్తిలి కాలువకు 453 క్యూసెక్కుల చొప్పున విడుదల చేస్తున్నారు.

రైతు సేవా కేంద్రానికి ఇన్వర్టర్ అందజేత



సంగాయగూడంలోని రైతు సేవా కేంద్రానికి ఇన్వర్టర్ అందజేస్తున్న రైతు బ్రహ్మజీ

దేవరపల్లి: సంగాయగూడెం పంచాయతీ పరిధిలోని గాంధీనగరానికి చెందిన రైతు పిన్నమనేని బ్రహ్మజీ తన తండ్రి వెకంటరామారావు జ్ఞాపకార్థం ఇన్వర్టర్‌ను రైతు సేవా కేంద్రానికి మంగళవారం అందజేశారు. విద్యుత్ సరఫరా లేని సమయంలో ఇబ్బంది కలుగుతున్నందున ఇన్వర్టర్ బహూకరించినట్టు బ్రహ్మజీ తెలిపారు. దాత బ్రహ్మజీకి సర్పంచ్ కుసులూరి ఉషారాణి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పొగాకు రైతు సంఘం అధ్యక్షులు కరుటూరి శ్రీనివాస్, రైతులు పాల్గొన్నారు.

దేవరపల్లి పీహెచ్‌సీ స్థాయి పెంచడానికి కృషి

దేవరపల్లి: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చే రోగుల సంఖ్య ఎక్కువగా ఉన్నందున ఆసుపత్రి స్థాయిని 30 పడగకలుగా తీర్చిదిద్దడానికి కృషి చేస్తున్నట్టు ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు అన్నారు. పీహెచ్‌సీలో రోగుల సౌకర్యం కొరకు తన సొంత నిధులతో కూలర్‌ను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ ఎస్. వేణుగోపాల్‌రెడ్డి, వైద్యాధికారులు సాంబశివరావు, డాక్టర్ సంజీవ్ కుమార్, పార్టీ మండల అధ్యక్షులు ఆండ్రు అనీల్, మాజీ జెడ్పీటీసీ సభ్యురాలు కొయ్యలమూడి సుధారాణి, మండల టీడీపీ మాజీ అధ్యక్షులు కొయ్యలమూడి చిన బాబు, సుంకర దుర్గారావు, బందపురం సర్పంచ్ కాట్రగడ్డ గాంధీ, పార్టీ నాయకులు గన్నమని హరికృష్ణ, కూటమి నాయకులు పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్యస్వామికి పంచామృతాభిషేకం

ఉండ్రాజవరం: చైత్ర మాసం తదియ సందర్భంగా ఉండ్రాజవరంలోని శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామికి మంగళవారం పంచామృతాలతో అభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారికి విశేష అలంకరణ అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని, స్వామి వారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.